## బీఆర్ఎస్‌లోకి దాసరి ఉష


పార్టీలో చేరిన అనంతరం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న ఉష

పెద్దపల్లి, మార్చి 18 : బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష బీఆర్ఎస్‌లో చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె, ఆమె తండ్రి హన్మయ్య బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఉషతో పాటు పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన దాదాపు 200 మంది బీఎస్పీ నాయకులు కూడా గులాబీ కండువా కప్పుకున్నారు. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె, 10,315 ఓట్లు సాధించారు.

## నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- కోడ్ ఉల్లంఘిస్తే 1950, 18004254731 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వండి
- కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి


కంట్రోల్ రూమ్ ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 18 : ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలించినా, పంపిణీ చేసినా టోల్‌ఫ్రీ నంబర్లు 1950, 18004254731కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, అందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరుపుతారని స్పష్టం చేశారు. ఓటరు కార్డు రాకున్నా, ఓటు హక్కు ఉన్నదా? లేదా? అనే విషయం తెలుసుకునేందుకు, ఎలాంటి అనుమానాలైనా నివృత్తి చేసుకునేందుకు ఫోన్ చేయాలని సూచించారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఆందోళనలు నిర్వహించినా, సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బ్యానర్లు, పోస్టర్లు, మైకులు, సౌండ్ బాక్సుల ఏర్పాటు కోసం సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, సీపీవో కే కొమురయ్య, ఆర్డీవో కే మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మా జీతాలేవి..?

- మూడు నెలలుగా పస్తులుంటున్నాం..
- జగిత్యాలలో సెకండ్ ఏఎన్ఎంల ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన

జగిత్యాల/జగిత్యాల అర్బన్, మార్చి 18: జీతాల కోసం వైద్య ఆరోగ్య శాఖలో సెకండ్ ఏఎన్ఎంలు ఆందోళన బాటపట్టారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు పస్తులుంటున్నాయని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటూ నిరసన వ్యక్తం చేశారు. అయితే సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తూనే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఏడు నెలల పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలన్నారు. అలాగే ఎలాంటి రాత పరీక్షలు లేకుండా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జీతాల కోసం మూడు నెలలపాటు వేచి చూశామని, ఓపిక నశించి విధిలేని పరిస్థితుల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. తమ మూడు డిమాండ్లను నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా, సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

# సెంట్రల్ లైటింగ్ కలేనా?


సూచికలు లేక ప్రమాదాలు జరుగుతున్న స్థలం

- ప్రభుత్వం మారిన తర్వాత ఆగిన అభివృద్ధి పనులు
- సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు
- పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బందులు

**చొప్పదండి పట్టణవాసుల చిరకాలవాంఛ అయిన సెంట్రల్ లైటింగ్ నిర్మాణం ఇక కలేనా? అంటే.. ప్రస్తుత పనుల పరిస్థితి చూస్తే అలాగే ఉన్నది. గత కేసీఆర్ ప్రభుత్వం పట్టణ రూపురేఖలను మార్చేందుకు రహదారి విస్తరణ పనులు చేపట్టింది. అందులో భాగంగా ₹33 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు ఆగిపోవడంతో పట్టణవాసులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది.**

చొప్పదండి, మార్చి 18 : మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న చొప్పదండిని కేసీఆర్ ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చింది. అంతే కాకుండా, పట్టణ అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు ₹33 కోట్లతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు ప్రారంభించింది. సైడ్ డ్రైన్, రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పట్టణ ప్రధాన కూడలిలో పనులు పూర్తికాకుండా రోడ్డును వ్యాపారులు ఆక్రమించడం వల్ల ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### సూచికలు లేక ప్రమాదాలు

సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులు మధ్యలోనే ఆగిపోగా, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలోని మర్లవాడ నుంచి గుమ్లాపూర్ ఎక్స్ రోడ్ వరకు ప్రధాన రహదారిలో డివైడర్ నిర్మించాల్సి ఉండగా, మధ్యలోనే ఆపేశారు. డివైడర్ నిర్మాణం ఆపిన ప్రాంతంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం, రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రోడ్డు పక్కన మట్టిని తీయకపోవడంతో విపరీతంగా దుమ్ము లేచి ఇబ్బంది పడుతున్నారు.


చొప్పదండి పట్టణంలో నిర్మాణం పూర్తికాక ఇరుకు రోడ్డులో వెళ్తున్న వాహనాలు

### ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం



చొప్పదండి పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు ఆగిపోయాయి. పైఅధికారుల నుంచి ఆదేశాల రాగానే పనులను మొదలు పెడుతాం. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యతతో నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

**- కే నాగరాజు, చొప్పదండి మున్సిపల్ కమిషనర్**


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 18 : ఎస్సీ సామాజిక వర్గంలోని 57 ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైర వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్ల సభలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీలకు మూడు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆందోళనలో సంఘ ప్రతినిధులు రాయల లక్ష్మీనర్సయ్య, బాణాల రాజారాం, ఔషధం రవీందర్, పరమేశ్వర్, బొల్లంపల్లి సాగర్, తోటపల్లి రాజలింగం, పురుషోత్తం ప్రభాకర్, మహేశ్ పాల్గొన్నారు.


జాజిరి ఆడుతున్న చిన్నారులు

## రింగుడు బిల్లా.. రూపాయి దండా..

మొదలైన జాజిరి ఆటలు

కోల్‌సిటీ, మార్చి 18: 'రింగుడు బిల్లా రూపాయి దండా.. దండకాదురా దామెర మొగ్గ..' 'ఆ గుండు ఈ గుండు ఇత్తడి గుండు.. గుండువోయి గండి మీద మోతలు వెట్టె..' 'కోతిపుట్టుడెందుకు.. కొమ్మలెక్కేతందుకు..' 'ఎల్లిరన్న బుల్లి కోడె.. నాలగంధం పూసుకోని..' 'మల్లే చెట్టు కిందికెళ్లి మదానో నావయ్యారి..' అంటూ వెన్నెల వెలుగుల్లో జాజిరి ఆటలు మొలయ్యాయి.హోలీ పండుగకు ముందు మొదలయ్యే జాజిరి కొత్త సందడిని తీసుకువస్తుంది. తొమ్మిది రోజులపాటు పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా.. కులమతాలకతీతంగా ఆడుకునే కాముడి ఆటలతో ప్రతి వీధీ హోరెత్తుతుంది. మగ పిల్లలు కోలలతో.. ఆడ పిల్లలైతే చప్పట్లతో పసందైన పాటలు పాడుతూ.. ఇంటింటికీ తిరుగుతూ.. ఆడుతోంటే మార్మోగుతుంది. తొమ్మిది రోజులపాటు సేకరించిన వడ్లు, మక్కలు, బియ్యం వంటివి ఆఖరి రోజు షావుకారి దగ్గర అమ్మడం.. వచ్చిన డబ్బులతో తెల్లవారి హోలీ జరుపుకోవడం మజానిస్తుంది.

# 'పది' పరీక్షలు మొదలు


రాజన్న సిరిసిల్లలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- తొలిరోజు ప్రశాంతం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 219 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాసిన 38,006 మంది విద్యార్థులు
- 66 మంది గైర్హాజరు

కమాన్‌చౌరస్తా, మార్చి 18: పది పరీక్షలు మొదలయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 38,095 మంది విద్యార్థుల కోసం విద్యాశాఖ జిల్లాల వారీగా 219 సెంటర్లు ఏర్పాటు చేసింది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 పరీక్ష నిర్వహించగా, మొత్తంగా 38,029 మంది పరీక్షలు రాశారు. 66 మంది గైర్హాజరయ్యారు. కాగా, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్ సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల, మంకమ్మతోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ధన్గర్‌వాడీ) సెంటర్లను కలెక్టర్ పమేలా సత్పతి, జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లె వద్ద గల గౌతమి స్కూల్, బైపాస్ రోడ్డులోని ఆక్స్‌వర్డ్ హైస్కూల్, పాత బస్టాండ్ వద్ద ప్రభుత్వ హైస్కూళ్లలోని సెంటర్లను కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష, పెద్దపల్లి మండలం రంగంపల్లిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలోని సెంటర్‌ను కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.


కరీంనగర్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

## జిల్లెల్ల చెక్‌పోస్టులో రూ.లక్ష పట్టివేత


నగదును సీజ్ చేస్తున్న సిబ్బంది

సిరిసిల్ల రూరల్, మార్చి 18 : తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టులో సోమవారం ఎన్నికల అధికారులు రూ.లక్ష పట్టుకున్నారు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన స్వామి కారులో హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వస్తున్నాడు. ఈ క్రమంలో జిల్లెల్ల శివారులోని చెక్ పోస్టులో ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష పట్టుబడింది. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు ₹50 వేలకు మించి దగ్గర ఉంచుకోవద్దని, అంతకు మించితే సరైన ఆధారాలు ఉండాలని సూచించారు.

## మంథని విద్యార్థి షార్ట్ మూవీకి బెస్ట్ అవార్డు




వినయ్‌సాయి నిర్మించిన ఫోర్త్ డీ చిత్రం

పెద్దపల్లి, మార్చి 18(నమస్తే తెలంగాణ): జాతీయ స్థాయిలో ఏటా ముంబై యూనివర్సిటీ, రాష్ట్రీయ్ కళా మంచ్, విద్యార్థి నిధి సంయుక్తంగా నిర్వహించే నేషనల్ స్టూడెంట్ ఫిలిం ఫెస్టివల్ (ఎన్ఎస్ఎఫ్ఎఫ్)కు మంథని పట్టణంలోని శ్రీరామ కాలనీకి చెందిన ఆకుల వినయ్‌సాయి తీసిన శాట్ మూవీ ఎంపికైంది. జాతీయ స్థాయిలో 100 ఎంట్రీలను స్వీకరించి 20ని ఎంపిక చేయగా, అందులో తెలంగాణ నుంచి రెండు షార్ట్ మూవీలు ఎంపిక చేశారు. మొత్తం 20లో బెస్ట్ 5 షార్ట్ మూవీలను ఎంపిక చేశారు. అందులో హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చేస్తున్న ఆకుల వినయ్‌సాయి చిత్రీకరించిన సైంటిఫిక్ మూవీ 'ఫోర్త్ డీ' బెస్ట్‌గా ఎంపిక కాగా, ఆదివారం ముంబైలోని ముంబై యూనివర్సిటీ జరిగిన ఫిలిం ఫెస్టివల్‌లో బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి, బన్సాలీ స్టూడియోస్ అధినేత వినోద్ బన్సాలీ చేతుల మీదుగా ₹25వేల నగదును వినయ్ అందుకున్నారు.

# మా ఇండ్లు మాకివ్వండి

- డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు
- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- స్పృహ తప్పిపడిపోయిన మహిళ
- వెంటనే దవాఖానకు తరలింపు


డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి18: పెద్దపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. తమ ఇండ్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో పేదల కోసం చందపల్లి, కునారం రోడ్ వద్ద 484 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారని, రిజర్వేషన్ ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపికచేశారని చెప్పారు. చిన్న చిన్న పనులు మిగిలి ఉండడం, అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో తమకు ఇండ్లు అప్పగించలేదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇండ్లు అందజేయాల్సి ఉన్నా.. ఇందిరమ్మ ఇండ్ల పేరిట కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టి తాత్సారం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పలుమార్లు ఆందోళన చేస్తే సోమవారం ఇండ్లు ఇస్తామని మాట ఇచ్చారని, తీరా ఇక్కడికి వస్తే పట్టించుకోవడం లేదని, అందుకే నిరసన తెలుపుతున్నట్లు వివరించారు. కాగా, ఆందోళన చేస్తున్న క్రమంలో రంజాన్ ఉపవాసం ఉన్న జమృత్ బేగం స్పృహ తప్పిపడిపోయింది. ఆమెను వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అనంతరం లబ్ధిదారులు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

### ఎన్నికల తర్వాత పంపిణీ చేస్తాం: కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇండ్లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఇప్పటిప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని చెప్పారు. 3 నెలలు ఓపిక పడితే, అర్హులందరికీ ఇండ్లు అందజేస్తామని స్పష్టం వివరించారు.


స్పృహ తప్పిపోయిన మహిళను దవాఖానకు తరలిస్తూ..

## ఇంటర్, డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లి, మార్చి 18: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం ఆర్‌జేసీ-సెట్.. బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఆర్‌డీసీ -సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలంగాణ బీసీ గురుకుల విద్యా సంస్థల ఉమ్మడి కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం గౌతం కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బాలుర గురుకుల జూనియర్ కళాశాలలు, 13 బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నాయని, ఈ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ , సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీతోపాటు వృత్తి విద్యా కోర్సులు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ మల్లేశ్, కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

## 'బిదాయి నాట్ జుదాయి' అదుర్స్

అల్ఫోర్స్‌లో ఫేర్‌వెల్ సంబురాలు

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'బిదాయి నాట్ జుదాయి 2024' పేరుతో ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని శాతవాహన యూనివర్సిటీ వీసీ సంకశాల మల్లేశ్ ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని డిగ్రీ కళాశాలలకు దీటుగా కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఉన్నతస్థాయి విద్యాబోధన పద్ధతులను పాటిస్తూ రాణిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు